క్లుప్తంగా

మెరుగైన సేవలందించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: గ్రామ సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలందించాలని మండల అభివృద్ధి అధికారి అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం పేరలి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. ప్రజలు సచివాలయానికి వచ్చినప్పుడు వారి సమస్య తెలుసుకుని పరిష్కరించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అనంతరం నల్లమోతువారిపాలెం వెన్నెలకంటినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో సందర్శించారు. విద్యార్థుల హాజరు పట్టీని పరిశీలించి పౌష్టికాహార పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మహేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయండి



అమర్తలూరు(వేమూరు): నీటి సంఘాల, సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యే విధంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాల, సొసైటీ ఎన్నికలను అందరూ కలిసి మాట్లాడుకుని ఏకగ్రీవం అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి విలువ ఉంటుందని, పని చేయని వారిని పక్కన పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ నగర్‌లో 'పొలం పిలుస్తోంది'



చుండూరు(వేమూరు): వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తగా నిల్వ చేసుకోవాలని ఏవో బి.ఆదంబాబు అన్నారు. చుండూరు మండలంలోని అంబేడ్కర్ నగర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరు వరి కోతలను వర్షాలు తగ్గే వరకు ఆపాలని చెప్పారు. మండలంలో ప్రతి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గోనె సంచులు కొనుగోలు కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఓలేరులో పునీత ఫ్రాన్సిస్ శౌరి వేడుకలు



ఓలేరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఓలేరు గ్రామంలోని పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శౌరి ఆలయంలో విచారణ గురువులు సేవి పుదుచ్చెరి, సుపీరియర్ ఫాదర్ మార్టిన్, రవికుమార్, సహాయక గురువు బెన్నీ కారుకుళంల పర్యవేక్షణలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా శౌరి వారి మహోత్సవం పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. విచారణ గురువులు సురేష్ (అవనిగడ్డ) ప్రసాద్ (రేపల్లె) చిన్నన్న (అంగలకుదురు) టోమీ జోసఫ్ (భాస్కరరావుపేట) ఫాదర్ సెబాస్టియన్ (నల్లజర్ల)లు దివ్య పూజాబలిలో పాల్గొన్నారు. దివ్య పూజాబలి కార్యక్రమాన్ని ఈ ఏడాది ఎటువంటి ఆడంబరాలు లేకుండా శౌరి వారి దేవాలయంలోనే శాస్త్రయుక్తంగా నిర్వహించామని సేవి పుదుచ్చెరి (ఓలేరు విచారణ గురువు) తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, గురువులు, కన్య స్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కూపాలు.. వ్యాధులకు నిలయాలు



కొల్లూరు లాక్ సెంటర్‌లో దుర్గంధం, దోమల వ్యాప్తికి కారణమవుతున్న చెరువు



దోనేపూడి కల్యాణ మండపం వద్ద వ్యర్థాలతో నిండిపోయిన చెరువు

- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- దోమల విజృంభణతో ప్రజలు గగ్గోలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

కొల్లూరు : ముక్కుపుటాలు అదరగొట్టే దుర్గంధం .. కుప్పలు తెప్పలుగా దోమల వ్యాప్తికి కారణమవుతున్న మురుగు కూపాలు వ్యాధుల వ్యాప్తికి మూల కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామాలలో పారిశుధ్యం పడకేయడంతో వ్యాధులు ప్రబలడం, విష జ్వరాల వ్యాప్తి అధికమై ప్రజలు మంచం పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, దోమల వ్యాప్తిని నిర్మూలించడం వంటి అంశాలు ప్రభుత్వం మాటలకే పరిమితం చేయడంతో పల్లెలు, మండల కేంద్రాలలో అపరిశుభ్ర వాతావరణం కారణంగా ప్రజలు జ్వరాలు, ఇతర కాలానుగుణ వ్యాధుల బారిన పడి వైద్యశాలల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



అనంతవరం పాడుబడిన బావి వద్ద నెలల తరబడి నిలిచిపోయిన వర్షపు నీరు

- గతంలో వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీ శాఖల యంత్రాంగం సంయుక్తంగా దోమల వ్యాప్తిని అరికట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చేపట్టిన డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమంకు మంగళం పాడటంతో ఎక్కడి మురుగు అక్కడ తిష్ట వేసి దోమల విజృంభణకు మూల కేంద్రాలుగా నిలుస్తున్నాయి.
- జ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, కనీసం గ్రామాలలో బ్లీచింగ్ సైతం చల్లకపోవడం ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతుందన్న విమర్శలు ప్రజలలో వెలువడుతున్నాయి.
- కొల్లూరు లాక్ సెంటర్‌లోని చెరువు ఎండగట్టిన సమయంలో వ్యర్థాలు, గుర్రపు డెక్కను తొలగించకుండా వదిలివేయడం, చెరువు కట్టపై ఉన్న గృహస్తులు మరుగుదొడ్ల నుంచి మల, మూత్ర విసర్జన పైపులను చెరువులోకి పెట్టడంతో పరిసర ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మండలంలోని అనంతవరం ఎస్సీ ఏరియాలో గృహాల వెంబడి నెలల తరబడి వర్షపు నీరు నిలిచిపోయి అధ్వాన పరిస్థితుల్లో ప్రజలు జీవనం సాగిస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం పట్టనట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తుంది.
- దోనేపూడి చెరువులో పంచాయతీ వ్యర్థాలు వేయడంతో విషతుల్యంగా మారిన చెరువు నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెందడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి దోమల బెడద నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరతున్నారు.

అధికారులు లేని సర్వసభ్య సమావేశం



అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ అభివృద్ధికి అధికారులు పూర్తిగా సహకారించాలని ఎంపీపీ రాపర్ల నరేంద్ర అన్నారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాక పోవడంతో ఆయన మండిపడ్డారు. సమస్యలపై అధికారులతో మాట్లాడేందుకు సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీపీ నరేంద్ర ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటూరు ఎంపీటీసీ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు సక్రమంగా పని చేయడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీవో మారుతి శేషాంబ మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం అధికారుల పని తీరు కోసం నిర్వహించడం జరుగుతుందని, అందువల్ల అధికారులందరు హాజరు కావలెనాని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన హెచ్‌ఐవీ వారోత్సవాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎయిడ్స్ డే వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం విద్యార్థినులకు రంగోలీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు రిబ్బన్ ఆకారంలో, మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.బుజ్జి బాబు, అధ్యాపకులు బి.కోటేశ్వరరావు, డాక్టర్ వీవీ రవీంద్ర, డాక్టర్ ఎం.దాసు, కె.బాలగురవయ్య పాల్గొన్నారు.



రిబ్బన్ ఆకారంలో, మానవహారంగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ

భట్టిప్రోలు: ఇటీవల కృష్ణానదీ పరివాహక లంక గ్రామాలకు వరదల నేపథ్యంలో సర్వం కోల్పోయిన పేద విద్యార్థులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) బాపట్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం కిట్లను అందజేశారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో కృష్ణా నది కరకట్ట దిగువనున్న పెసర్లంక హైస్కూల్ వరద ముంపుకు గురైన సంగతి తెలిసిందే. హైస్కూల్‌కి చెందిన 240 మంది విద్యార్థులకు దుప్పటి, కార్పెట్, ప్యాడ్, స్టేషనరీతో కూడిన కిట్లను ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బాషా, ఉపాధ్యాయ వాణి సంపాదకులు షేక్ జిలాని, మాజీ రాష్ట్ర కార్యదర్శి బి.రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం, రాష్ట్ర కౌన్సిలర్స్ టి.శ్రీనివాసరావు, పద్మావతి, జిల్లా కార్యదర్శి దోవా రవి, కె.వెంకటరత్నం, ఎం.హరి ప్రసాద్, హెచ్‌ఎం మహబూబ్ బాషా, ఏపీటీఎఫ్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కిట్లు అంద చేస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల

ఘనంగా ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ-2, ఉపాధ్యాయులు



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి భవిత కేంద్రంలో మంగళవారం ఘనంగా ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఏపీ సమగ్ర శిక్ష ఆదేశానుసారం ప్రత్యేక అవసరాలు గల విభిన్న ప్రతిభా వంతులైన వారి కోసం ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను, పథకాలను ప్రవేశ పెడుతుందని ఐఈడీ ఉపాధ్యాయులు కె.రత్నాకర్, ఎం.ఇవాంజలిన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు విద్య, ఆట పాటల ద్వారా వారి కళా తృష్ణను తెలుసుకునేందుకు కృషి చేశారు. రానున్న క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని క్యాండిల్స్‌ను వెలిగించి క్రిస్మస్‌కు స్వాగతం పలికారు. వీరి కోసం ప్రత్యేకంగా ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులు, సంరక్షకులను సన్మానించి వారికి మనో ధైర్యాన్ని కల్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు కేఎల్ కాంతారావు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ యూపీ హెచ్‌ఎం కొండ్రే హవీలా ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల రాణింపుకు కృషి అవసరం

కొల్లూరు : దివ్యాంగ విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించి ముందంజలో ఉండే విధంగా వారిలో సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి కృషి చేయడం అవసరమని ఎంఈఓ-2 వి.సౌభాగ్యజ్యోతి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొల్లూరు గౌడపాలెంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సేవలు అందించడం, విద్యాబోధన ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించి ఉన్నతంగా రాణించేందుకు పాటుపడాలని సూచించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు కె.అరవిందకుమార్, హెచ్‌ఎం వి.ఉమాదేవి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు టి.ధనరాజు, ఎం.అంతోనమ్మపాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్నఎంఈఓ-2

బధిరుల ఆశ్రమ పాఠశాలలో..

బాపట్ల: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని బధిరుల ఆశ్రమ పాఠశాలలో భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం పాఠశాలలో బిస్కెట్ ప్యాకెట్లు, పెన్నులు, పెన్సిల్స్, సబ్బులు, దువ్వెన రబ్బరు ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.బ్రహ్మం, ప్రాంతీయ అధ్యక్షులు శ్రీహరిరావు, సెక్రటరీ జె.వి.కృష్ణారావు, కోశాధికారి బొలగాని వెంకటేశ్వర్లు, జీవీ సుబ్రహ్మణ్యం, కాళిదాసు, వీరభద్రయ్య, రామనారాయణ పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): భవిత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సేవలు అందించడం జరుగుతుందని ఎంఈఓ-2 సలోమాన్ తెలిపారు. చుండూరు మండలంలోని మున్నంగి వారి పాలెంలోని భవిత సెంటర్‌లో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 సలోమాన్ మాట్లాడుతూ భవిత కేంద్రంలో పిల్లలకు చదువుతో పాటు స్పీచ్ తెరపీ, మానసిక వికలాంగులకు సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. భవిత కేంద్రం ద్వారా విద్యార్థులకు వచ్చే అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, కె.శివకుమారి, శ్రీనివాసరెడ్డి, స్కూలు అసిస్టెంట్ రమాదేవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



కర్లపాలెం: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని కర్లపాలెం ఎస్‌ఐ ఎ.రవీంద్ర చెప్పారు. కర్లపాలెం భార్గవి హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ సమాజంలో అనేక విధాలుగా సైబర్ నేరాలు పెరిగాయని విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరమని విద్యార్థులందరూ కలసి ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వలన ఎన్నో సమస్యలు వస్తున్నాయని బాలికలు ధైర్యంగా ఎదిరించాలని చెప్పారు. కార్యక్రమంలో భార్గవి హైస్కూల్ వ్యవస్థాపకుడు పేరాల వెంకట సురేష్, మహిళా పోలీస్ ఆనందకుమారి, విద్యార్థులు ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ



రేపల్లె రూరల్: దివ్యాంగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల కుటుంబాలకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందించాలని, ప్రతి దివ్యాంగులకు రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలన్నారు. చదువుకున్న దివ్యాంగులందరికీ ప్రతి సంవత్సరం బ్యాక్‌లాగ్ పోస్టులు విడుదల చేయాలని, వ్యాపారం చేసుకుంటున్న ప్రతి ఒక్క దివ్యాంగునికి ఎలాంటి నిబంధనలు లేకుండా సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. దివ్యాంగుల పెళ్లి కానుకకు రూ.2 లక్షలు ఇవ్వాలని, దివ్యాంగుల పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న దివ్యాంగుల అలవెన్స్ రూ.2000 నుంచి రూ.5,000కు పెంచాలని, అలాగే కోరుకున్న చోట విధులు నిర్వహించే అవకాశం కల్పించాలన్నారు. అనంతరం రాష్ట్ర వికలాంగుల సంఘం అధ్యక్షుడు నీల జోజిబాబు, టీడీపీ నాయకుడు జీవీ నాగేశ్వరరావు, ఎన్‌ఆర్‌ఐ పర్చూరు శ్రీనాథ్, రసాలయ కళా సమితి సభ్యుడు మేక రామకృష్ణ, భవిత స్కూల్ ఉపాధ్యాయురాలు అనురాధ, రిటైర్డ్ ఉపాధ్యాయులు కొక్కిలగడ్డ శివశంకర్ రాజు, జీపీఎస్ వరప్రసాదరావులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆలపాటి మధుసూదనరావు, కోశాధికారి షేక్ ఖాదరవలి, సంఘ సభ్యులు దోవా గోపీనాథ్, ఓబులేశ్వరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారం

ఎక్సైజ్ సీఐ పి.గీతిక



బాపట్లటౌన్: మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అంధకారంగా మారుతుందని ఎక్సైజ్ సీఐ పి.గీతిక అన్నారు. సారా రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి దశలో జల్సాలతో గంజాయి, హాషిష్, సారా, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో జీవితంలో మత్తు పదార్థాల జోలికి వెళ్లమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రభుదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే పునాదులు

చెరుకుపల్లి: ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే పునాదులని వారికి ఎల్లప్పుడు తోడుగా ఉంటానని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మంగళవారం గుళ్ళపల్లిలోని క్యాంపు కార్యలయంలో గణేష్ అధ్యక్షతన రేపల్లె పట్టణ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగాలని తపించారని, పేద విద్యార్థులకు విద్యా ప్రదాతగా, నిరుపేదలకు వైద్య ప్రదాతగా, మహిళలకు అన్నగా, తమ్ముడిగా ఆర్థిక భరోసా కల్పించిన గొప్ప వ్యక్తి జగనన్న అని గుర్తు చేశారు. అటువంటి మనసున్న వ్యక్తిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని డాక్టర్ గణేష్ పిలుపునిచ్చారు. ఏ కార్యకర్త అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి తగు గుర్తింపు, గౌరవం దక్కుతుందన్నారు. చంద్రబాబు జిమ్మిక్కులు నమ్మి ప్రజలు ఓట్లు వేశారని అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల, గ్రామ స్థాయి కమిటీలను నియమిస్తున్నామని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్, న్యాయవాది బొర్రా శ్రీనివాసరావు, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, చందోలు నాగలక్ష్మీకుమారి, సజ్జా పద్మావతి, వి.నాగలక్ష్మీ, రేపల్లె పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరి గణేష్

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీల ఏర్పాటు

భట్టిప్రోలు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం గోరిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెంలో నూతన గ్రామ కమిటీ అధ్యక్షులుగా పురమా శ్రీనివాసరావుతో పాటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంతకముందు వెల్లటూరు గ్రామ పార్టీ అధ్యక్షుడితో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శులు, నలుగురు కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు దారావత్ కుమారిభాయ్, చౌటూరి రవీంద్ర, పడమటి శ్రీనివాసరావు, దారావత్ కృష్ణ నాయక్, గురిందపల్లి సునీల్, కృష్ణారావు, మాతంగి రవీంద్ర, శివమణి పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నిజాంపట్నం: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తిరుపతిరావు అన్నారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు మండలంలోని నిజాంపట్నం జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, హెల్మెట్ ధారణ, రోడ్డు ప్రమాదాలపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పెరిగిందని, దీనిని ప్రతి ఒక్కరూ అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని చెప్పారు. దుర్వినియోగం చేస్తే మూల్యం చెల్లించక తప్పదన్నారు. అపరిచితులు ఫోన్ చేస్తే ఓటీపీ వంటివి చెప్పరాదన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలను పెట్టరాదన్నారు. ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని చెప్పారు. హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కాపాడేందుకు రైతుల ఇక్కట్లు





వేమూరు/భట్టిప్రోలు: తుఫాన్ వల్ల కురుస్తున్న జల్లులు, వర్షం వల్ల రైతులు వరి ధాన్యం కాపాడేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో హార్వెస్టర్ ద్వారా వరి కోతలు ముమ్మరంగా సాగాయి. రైతులు ధాన్యం రోడ్లపై ఆరబెట్టారు. తుఫాన్ వల్ల కురుస్తున వర్షాలకు రైతులు ధాన్యం కాపాడేందుకు బాధలు పడుతున్నారు.

కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన గాదె

బాపట్ల: జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళిని మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జె.వెంకట మురళితోపాటు జేసీ ప్రఖర్‌జైన్‌ను కలిశారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తామని తెలిపారు. పలువురు జిల్లా అధికారులను కలిసి జిల్లాలో పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువెళ్లారు.

